రోడ్లు అధ్వానం.. పట్టించుకోని యంత్రాంగం

- స్థానికులు, వాహనదారుల అవస్థలు
- సుంకరపాలెం జంక్షన్ వద్ద బురదమయం
- అమలాపురంలో బైపాస్ వద్ద సీసీ రోడ్డుకు బెర్మ్ లేక ప్రమాదాలు



జాతీయ రహదారి 216పై సుంకరపాలెం జంక్షన్ వద్ద మురుగునీరు



యానాం-ద్రాక్షారామ రహదారిపైకి డ్రెయినేజీల నుంచి చేరిన మురుగు నీరు



అమలాపురం బైపాస్ మార్గంలో మలుపు వద్ద ప్రమాదభరితంగా రోడ్డు మార్జిన్

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్‌లోని రహదారులు అస్తవ్యస్తంగా తయారై స్థానికులకు, పాదచారులకు, వాహనదారులకు నరక ప్రాయంగా మారింది. జాతీయ రహదారుల శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జంక్షన్‌లో నిత్యం మురుగునీరు పారడంతో స్థానికులు అవస్థలకు గురవుతున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన డ్రెయినేజీల్లో మురుగునీరు పారకపోవడంతో డ్రెయినేజీలో నీరు రహదారిపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో యానాం-ద్రాక్షారామ రహదారిలోకి మురుగునీరు ప్రవేశించి పాదచారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు.

వర్షం వస్తే అవసలు

ఇదే ప్రాంతంలో నిత్యం అనేక మంది విద్యార్థులు, ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం వేచి ఉంటారు. ఇక వర్షం వస్తే పరిస్థితి వర్ణనాతీతం. వర్షం నీటితోపాటు మురుగునీరు కలసిపోయి రహదారిపై నిలిచిపోతోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వర్షం నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లి స్థానిక వ్యాపారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఎటువంటి ఫలితం లేదని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సుంకరపాలెం జంక్షన్‌లో మురుగు నీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

అమలాపురం టౌన్: అది అమలాపురంలో ఈదరపల్లి వంతెన నుంచి నల్ల వంతెన వరకూ దాదాపు కిలోమీటరు మేర ఉన్న బైపాస్ సీసీ రోడ్డు. మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు వెళ్లే ఈ రోడ్డు మలుపు వద్ద మార్జిన్ అత్యంత ప్రమాదకరంగా మారింది. ఆర్అండ్‌బీ ప్రమాణాలతో వెడల్పుగా విశాలతతో నిర్మించిన ఈ సీసీ రోడ్డును గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించారు. మొత్తం రోడ్డు అంతా సౌకర్యవంతంగా ఉంటుంది. డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో ఉన్న మలుపు వద్ద సీసీ రోడ్డుకు బెర్మ్ లేక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు సౌకర్యవంతంగా ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు ఎదురుగా వస్తున్న వాహనాల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో అక్కడ రోడ్డు మార్జిన్ సక్రమంగా లేక, బెర్మ్ నిర్మించకపోవడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు మార్జిన్ లేకపోవడం, బెర్మ్ నిర్మించకపోవడంతో ఆ పక్కనే ఉన్న చిన్న పాటి డ్రెయిన్ ప్రమాదాలకు పొంచి ఉంటోంది.

బైపాస్ రోడ్డుపై అసలే ట్రాఫిక్ రద్దీ

పట్టణ బైపాస్ రోడ్డుపై అసలే ట్రాఫిక్ రద్దీ. భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉంటుంది. అయినవిల్లి, అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్, ముమ్మిడివరం మండలాలు, కాకినాడ వైపు వెళ్లే భారీ వాహనాలన్నీ ఈ బైపాస్ రోడ్డు మీదుగానే వెళతాయి. ప్రతి నిమిషానికి ఈ బైపాస్ రోడ్డులో అయిదు భారీ వాహనాలకు తక్కువ కాకుండా వెళతాయి. ఇక ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు నిరంతరాయంగా వెళుతూనే ఉంటాయి. దీనికి తోడు ఈదరపల్లి పాత వంతెన పక్కన కొత్త వంతెన నిర్మిస్తున్న క్రమంలో విధించిన ట్రాఫిక్ ఆంక్షల భారం ఈ బైపాస్ రోడ్డుపై అధికంగా పడింది. దీంతో ఎడాపెడా ట్రాఫిక్ ఒత్తిడితో బైపాస్ రోడ్డుపై పెరిగిన వాహనాల రద్దీతో ఈ ప్రమాదకర మార్జిన్ ప్రాంతం మరింత ఆందోళనకంగా మారింది. ఈదరపల్లి వద్ద కొత్త వంతెన నిర్మాణంతో ఆ బైపాస్ రోడ్డుపై పెరిగిన వాహనాల తాకిడితో వాహన చోదకులు ప్రమాదాలకు నిలయమవుతున్న ఈ మలుపు విషయం తెలిసిన స్థానిక వాహన చోదకులు ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అక్కడ అతి జాగ్రత్తగా వాహనాలను నడుపుతున్నారు. కొత్తగా ఆ రోడ్డుపై వస్తున్న వాహన చోదకులు పలువురి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు, మున్సిపల్ అధికారులు ఈ రోడ్డు అసౌకర్యంపై తక్షణమే స్పందించాలని వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బెర్మ్ నిర్మించేందుకు ఏర్పాట్లు

బైపాస్ రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న సీసీ రోడ్డు మలుపు వద్ద బెర్మ్ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఆర్అండ్‌బీ ఏఈ తోట రమేష్ తెలిపారు. ప్రమాదకర మార్జిన్ వద్ద గ్రావెల్ వేసి పూడ్చేలా చర్యలు చేపడతామన్నారు.

క్లుప్తంగా

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ధర్నా

అమలాపురం రూరల్: కోనసీమలో గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కలెక్టరేట్ వద్ద సమ్మెలో భాగంగా సోమవారం 22వ రోజు ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 23 శాతం, జీతాలు పెంచాలని, ప్రోత్సాహకాలు బకాయిలు చెల్లించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మమత జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలని కోరారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు ఏ.సాయి శంకర్, శ్రీరామ్, హిమజ, మనోహర్ పాల్గొన్నారు.

సోలార్ ప్యానెళ్లపై అవగాహన సదస్సు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై సోమవారం పుదుచ్చేరి విద్యుత్ శాఖ, పునరుత్పాదక శక్తి ఏజెన్సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఇళ్ల కప్పులపై సౌరశక్తి విద్యుత్ కోసం ప్యానల్ ఏ విధంగా ఏర్పాటు చేయాలి, వాటివల్ల కలిగే ప్రయోజనాలను ఈ సదస్సులో వివరించారు. ఈ పథకం ద్వారా కిలోవాట్‌కు సబ్సిడీ రూ.30వేలు, రెండు కిలోవాట్‌కు రూ.60వేలు, 3 కిలోవాట్‌కు రూ.78వేలు సబ్సిడీ ఉంటుందని వీటికి సంబంధించి ప్యానెళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేందుకు మూడు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింధిల్‌కుమార్, ఏఈలు పాండ్యన్, శశికుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



నంగవరంలో గడ్డివామి మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఉప్పలగుప్తం: నంగవరం గ్రామంలో పాడి రైతు శీలం సత్యనారాయణకు చెందిన 6 ఎకరాల గడ్డి వామికి మంటలు వ్యాపించి కాలిబూడిదైంది. ఆదివారం అర్ధరాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు అంటించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మంటలు వ్యాపించిన సమయంలో చుట్టుపక్కల ప్రజలు గగ్గోలు పెడ్డటంతో ముమ్మిడివరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారన్నారు. భారీ వ్యయంతో పశువులకు గ్రాసాన్ని నిల్వ చేసుకున్నామని రైతు తీవ్ర ఆందోళన చెందాడు.

లైంగిక దాడి దారుణం

ముమ్మిడివరం: అయినాపురం పంచాయతీ పరిధి రామారావుపేటలో మానసికస్థితి సరిగా లేని బాలికపై వృద్ధుడు లైంగిక దాడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ విమర్శించారు. ఆయన సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు ముదే బాలయోగిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని కాపు కల్యాణ మండపం సమీపంలో షిర్డీ సాయి బాబా గుడివద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఇంజరం పంచాయతీ గోపులంకకు చెందిన కాకర్లపూడి గోపాలకృష్ణంరాజు రహదారి దాటుతుండగా యానాం వైపు నుంచి వస్తున్న మోటార్ సైక్లిస్టు ఢీకొనడంతో కాలు విరిగిపోయింది. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుడిని యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

పిడుగుపాటుకు నలుగురికి గాయాలు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా సోమవారం కురిసిన భారీ వర్షంతో పిడుగుపాటుకు గురై నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు జి.వేమవరం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న చింతపల్లి నాగేశ్వరరావు, చింతపల్లి సూర్యనారాయణ, కట్టా సూరిబాబు, దుర్యోధనుల నారాయణమూర్తి వర్షం కురవడంతో ఓ ట్రాక్టర్ ట్రక్కు వద్ద నిలుచున్నారు. ఆ సమయంలో భారీ శబ్దంతో సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడింది. దీంతో వారికి షాక్ తగిలి గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. వారు తాటిచెట్టు కింద ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు తెలిపారు.

కుమ్మరి కాలువ లాకు షట్టర్లకు మరమ్మతులు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అమలాపురం రూరల్: కుమ్మరి కాలువ లాకు షట్టర్లు పాడైపోవడంతో ఉప్పునీరు తమ పొలాల్లోకి రావడంతో పంటలు నష్టపోతున్నామని అమలాపురం మండలం పేరూరు చెందిన రైతులు కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో ముంపు సమస్య ఉందన్నారు. అధికారులు చొరవ చూపి దాదాపు 100 ఎకరాల వరి చేలను ఉప్పు నీటి ముంపు నుంచి కాపాడాలని రైతులు కోరారు. రైతు డేగల వెంకటరమణ అధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. లాకులను వెంటనే మరమ్మతులు చేయించాలని, కుమ్మరి కాలువ, మేక కాలువ వంతెన నుంచి గంట వారి తూము వరకు మురుగు కాలువలోని గురప్రు డెక్కను తొలగించాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘల నాయకులు దూనబోయిన గణేశ్వరరావు, జల్లి శ్రీను, ఎస్.సత్యనారాయణ, దూనబోయిన ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార వృద్ధులకు పింఛన్ల మంజూరు

యానాం: నియోజకవర్గ పరిధిలో వృద్ధులైన మత్స్యకారులు 278 మందికి నూతనంగా వృద్ధాప్య పింఛన్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి ధ్రువపత్రాలను ఈనెల 21న నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు కొత్తగా వృద్ధాప్య పింఛన్ల అంశాన్ని పుదుచ్చేరి ప్రభుత్వ మత్స్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువెళ్లి మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నట్లు తెలిపారు. తీరప్రాంత గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు గతంలో ఓఎన్‌జీసీ పరిహారం సైతం పక్కదోవ పట్టకుండా సరాసరి లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేయించడానికి విశేష కృషి చేసినట్లు ఆయన తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం

యానాం: వచ్చే ఏడాది మార్చి నెలలో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం పుదుచ్చేరిలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావడం, కమిటీల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. అంతకు ముందు ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై జాతీయజెండాలతో వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఇండియా బీజేపీ జనరల్ సెక్రటరీ దుష్యంత్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురేనా, హోం మంత్రి, జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు నమశ్శివాయం, ఎమ్మెల్యేలు కల్యాణ సుందరం, వీవీ రామలింగం, అశోక్‌బాబు, పార్టీ ఎగ్జిక్యూటివ్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్జీతో విభేదాలు లేవు

యానాం: లెఫ్టినెంట్ గవర్నర్ కె.కై లాషనాథన్‌తో తనకు ఎటువంటి విభేదాలు లేవని సీఎం రంగసామి స్పష్టం చేశారు. సోమవారం పుదుచ్చేరిలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ద్వారా మోడల్ హాస్పిటల్‌ను స్థాపించడానికి అవగాహన ఒప్పందం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్జీకి తనకు మధ్య ఎటువంటి వివాదం లేదన్నారు. అయితే తమ ప్రభుత్వం పుదుచ్చేరికి రాష్ట్ర హోదా స్టేట్‌హుడ్ డిమాండ్‌ను మాత్రం కేంద్రం దృష్టికి తీసుకెళుతూనే ఉంటుందన్నారు. రాష్ట్ర హోదా అంశాన్ని కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్‌తో చర్చలు కొనసాగిస్తామన్నారు.అందరూ రాష్ట్ర హోదా అంశానికి మద్దతునివ్వాలని కోరారు. ఎల్జీకి, సీఎంకు మధ్య విభేదాలు తలెత్తాయని ఇటీవలి మాజీ సీఎం నారాయణసామి చేసిన వ్యాఖ్యలపై సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ కార్యక్రమాలు వేగంగా అమలు చేయడంలో అడ్డంకులు ఎదురైనప్పుడు రాష్ట్ర హోదా వంటి అంశాలను లేవనెత్తుతామన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం సూరసాని యానాం గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి వారి గ్రామంలో 2015లో అప్పటి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అసంతృప్తిగా ఆగిన నిర్మాణ పనులను పునఃప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు తాడి గోపాలకృష్ణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తిచేయలేదని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ భవనం బీటలు వారి పగుళ్లు వస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని పీఆర్‌డీఈఈ రాజకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే ఆనందరావుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు డాక్టర్ శ్రీకాంత్ పరామర్శ



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణిని పరామర్శిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్, నాయకులు

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌తో పాటు పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. స్థానిక నారాయణపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తల్లి శ్రీరామ రాఘవమ్మ ఈనెల 17న వృద్ధాప్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. డాక్టర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు నారాయణపేట వెళ్లి చైర్‌పర్సన్‌కు తమ సానుభూతి తెలిపారు. దివంగత శ్రీరామ రాఘవమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్ రాజా, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, పార్టీ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కల్వకొలను ఉమ, దొంగ చిన్నా తదితరులు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు



కిత్తనచెరువుల నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు, అందులోని రిక్షాలు

ఉప్పలగుప్తం: ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు) నుంచి సంపద సృష్టించి గ్రామాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో దానికి విరుద్ధంగా అధికారుల నిర్లక్ష్యంతో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. మండలంలోని కిత్తన చెరువు ప్రాంతాల్లో రూ.7 లక్షలతో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును గతంలో నిర్మించారు. గ్రామంలో క్లాప్ మిత్రలు చెత్తను సేకరించి తీసుకొచ్చే విధంగా రెండు రిక్షాలను అందించారు. పంచాయతీ అధికారులు వాటిపై పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోందని, దానితో రోగాలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రిక్షాలను మూలకు చేర్చడంతో అవి తుప్పు పట్టి శిథిలావస్థకు చేరే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఘనంగా కుటుంబ వైద్యుల దినోత్సవం



డాక్టర్ రంగారావు కుటుంబాన్ని సత్కరిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ కుటుంబ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ శాఖ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొలకోటి రంగారావు వైద్య కుటుంబం సమక్షంలో వాకర్స్ హెల్త్ క్లబ్ సోమవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా డాక్టర్ గొలకోటి రంగారావు దంపతులను, వైద్యులైన వారి కుమార్తె, అల్లుడిని సత్కరించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పడాల నాయుడు, ఉపాధ్యక్షులు నూకల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల తవ్వకాలు నిలిపివేయాలి



నార్కెడిమిల్లిలో సెక్రటరీకి వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలోని నార్కెడిమిల్లిలో జనావాసాల సమీపాన చెరువుల తవ్వకాలను నిలిపివేయాలని ఆ గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ముత్యాల రామకృష్ణ, బొలుసు సూరిబాబు, ఎన్.పాపారావు, వై.దుర్గాసాయి, యడ్ల నాగేశ్వరరావు సహా సుమారు 80 మంది గ్రామస్థులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు, గ్రామ పంచాయతీ సెక్రటరీకి సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. ఆ నకళ్లను విలేకరులకు అందజేశారు. తమ నివాసాలకు దగ్గరలోనే ఉన్న భూమిలో అనగా సర్వే నంబర్ 145/4లోని 1.56 ఎకరాలతో పాటు ఇతర భూములను కలుపుకొని చెరువుల తవ్వకానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తమ ఇళ్లకు దగ్గరగా చెరువులు తవ్వడం వలన మా జీవనానికి ఇబ్బంది కలుగుతుందని, ఆరోగ్యాలు పాడవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల తవ్వకాల నిలుపుదలకు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

వైపరీత్యాలపై అప్రమత్తత అవసరం

యానాం: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశిస్తున్న నేపథ్యంలో కురిసే భారీ వర్షాలు, తుఫాన్లు వంటి వాటి పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పరిపాలనాధికారి ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలకు ముందే వాతావరణం చల్లబడుతుందని ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతు న్నాయని, భారీ వర్షాలపై వాతావరణ శాఖ సైతం హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో జీజీహెచ్ డీడీ రవిశంకర్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, మత్స్యశాఖ అధికారి గొంతియ్య, సీఐ అడలరసన్, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపకశాఖ అధికారులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఐవీ, సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు తదితరులు

తాళ్లరేవు: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, ఉత్తమ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య వంటి మహానుభావులు ప్రజా ఉద్యమాల ద్వారా పుట్టుకొస్తారన్నారు. ప్రజలకు సేవచేయడం, దోపిడీని, వివక్షను ప్రశ్నించే లక్షణాలను సుందరయ్యను చూసి నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వి. రాజబాబు, వి.ఏడుకొండలు, డి.అదృష్టదీపుడు, ఎస్.త్రిమూర్తులు, పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి ఆశయాలను కొనసాగిస్తాం

అమలాపురం టౌన్: తన జీవితాన్ని పేద ప్రజల అభ్యున్నతికి అంకితం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తామని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడారు.అనంతం జిల్లా సీపీఎం కమిటీ సభ్యులు, పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావుతో కలసి ఆయన ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యూటీఎఫ్ విశ్రాంత ఉపాధ్యాయుడు కంభంపాటి సూర్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జాన శంకరరావు

సఖినేటిపల్లి: చేనేత సహకార సంఘాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చేనేత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సఖినేటిపల్లి మండలం మోరిలో సోమవారం చేనేత విభాగం నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, మోరి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షులు జాన శంకరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వాకం వల్ల చేనేత వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు లేదా పాలక మండలి నియమించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనేక కార్పొరేషన్లకు పాలక మండలి నియమించి దేవాంగ కార్పొరేషన్‌కి పాలక మండలి ఏర్పాటు చేయకపోవడంతో.. దేవాంగులపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు. చేనేత వర్గంలో పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి మిగతా చేనేత కార్పొరేషన్లను ప్రకటించకపోవడం దీనికి తార్కాణమన్నారు. అలాగే దేవాంగ కార్పొరేషన్ పాలక మండలిని వెంటనే నియమించాలని కోరారు. ఆప్కో చైర్మన్‌ని నామినేట్ చేసి ఇంతవరకు జీఓ ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో నేతన్న నేస్తం ద్వారా మగ్గం ఉన్న వారికి ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకున్నారనీ, ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు ఇనుమర్తి వీర నాగరాజు, నాయకులు కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, చింతా సుధాకర్, లక్కింశెట్టి వీవీ సత్యనారాయణ, రామారావు, కందనాల ముత్యాలరావు, బట్టు దుర్గారావు, లక్కింశెట్టి ఏసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాలాజీ మాస కల్యాణం



బాలబాలాజీ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి మాస కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా జరిపించారు. విశేష సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో కర్తలుగా పాల్గొని స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక దర్శనం కల్పించారు. స్వామి వారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కోలాహలంగా మారింది. స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఏలూరుకు చెందిన రంబా చంద్రశేఖర్, రమ్య దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తికి అందజేశారు. దాతకు పర్యవేక్షకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.